క్లుప్తంగా

క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులు



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

ఇచ్చోడ: గిరిజన గురుకుల విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఉట్నూర్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఇచ్చోడ గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. తొమ్మిదోవ తరగతి విద్యార్థి అర్చన్ అండర్ –17 బాక్సింగ్ పోటీల్లో వెండి పథకం సాధించింది. పదో తరగతి విద్యార్థి వైష్ణవి నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించింది. కాగా సోమవారం పాఠశాల పిన్సిపాల్ రత్నకుమారి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఆశ్విని, లక్ష్మి, పీఈటీలు గంగామణి, లత, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు

ఆదిలాబాద్‌రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల, అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సర్ఫారాజ్ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌సీ క్లీన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిధిలోని మావల, దస్నాపూర్, రామాయి గ్రామాలకు చెందిన గర్భిణులు అంకోలిలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది సుభాష్, స్టాఫ్ నర్సులు దుర్గాత, గంగామణి, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధికి కృషి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జై శ్రీరాం గోశాల అభివృద్ధికి కృషి చేస్తానని సినీనటుడు, బీజేపీ నాయకుడు అభినవ్‌సర్దార్ అన్నారు. సోమవారం జైశ్రీరాం గోశాలను సందర్శించి అక్కడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోశాలకు రోడ్డు సౌకర్యం, గడ్డిని అందచేస్తానని గోశాల నిర్వాహకుడు రాజేశ్‌కు తెలిపారు. ఆయనతో పాటు ఆత్మరాం, సాయిరాం, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇచ్చోడ: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని సోమవారం మండల కేంద్రంలో కళాకారుల బృందం అవగాహన కల్పించారు. యువత ఎయిడ్స్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని పాటలు పాడుతూ.. వివరించారు. కార్యక్రమంలో కళాకారులు కాత్లె శ్రీధర్, చాహకటి తాను బాయి, ఆనంద్, దత్తు పాల్గొన్నారు.

రామాలయంలో ఎమ్మెల్యే పూజలు

ఆదిలాబాద్‌రూరల్: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా (టి) కోదండా రామాలయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. రాముని ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారట్ల భాస్కర్, ఉప్పర్ల దేవన్న, ఎస్ నర్సింగ్‌రావ్, కిషన్, దేవిదాస్, చిన్నం దేవిదాస్, చిక్కాల దత్తు, పుప్పల శైలేందర్, చిలుక దశరథ్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

నేరడిగొండ: జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్కకు సోమవారం రాత్రి మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద చేరుకోగా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు దాడులు చేసి బెదిరిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి ఆదివాసీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు ఆడె గజేందర్, మండల కన్వీనర్ ఆడె వసంత్‌రావు, ప్రపుల్ చందర్ రెడ్డి, పసుల చంటి, జల్లైజాకు, తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం..

- మార్మోగిన శ్రీరామ నామం
- కిక్కిరిసిన ఆలయాలు
- గ్రామాల్లో శోభాయాత్రలు



నేరడిగొండ: నినాదాలు చేస్తున్న గ్రామస్తులు



ఆదిలాబాద్‌రూరల్: పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు



బజార్‌హత్నూర్‌లో..



నేరడిగొండ: శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



బేలలో రామభక్తుల శోభాయాత్ర

● బోథ్ మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరామ నామం మార్మోగింది. సోమవారం ప్రజలు జైశ్రీరాం అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మార్కండేయ, విఠలేశ్వర, హనుమాన్, వేంకటేశ్వర ఆలయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● నేరడిగొండ మండల కేంద్రంతో పాటు వడూర్, తేజాపూర్, కుమారి, కుప్టి, తర్నం, దేవుల్‌నాయక్ తండా, కొర్టికల్, ఆరెపల్లి, వాంకిడి, బొందిడి, దర్బ, దర్బతండా గ్రామాల్లో అయోధ్య విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించి, జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

● ఇచ్చోడ మండల కేంద్రంలో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. బోడగుట్ట రామలక్ష్మణ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో పట్టు వస్త్రాలు తీసుకెళ్లారు.

● నార్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జైశ్రీరాం.. జైజై శ్రీరాం అనే నినాదంతో పల్లెలు మార్మోగాయి. నార్నూర్, తడిహత్నూర్‌లో శోభాయాత్ర నిర్వహించారు.

● జైనథ్ మండలంలోని రామాలయాలు కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లో రాములోరి శోభాయాత్ర ఆకట్టుకుంది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ భోరజ్, పిప్పర్‌వాడ ఆలయాల్లో పూజలు చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న తన స్వగ్రామమైన దీపాయిగూడలోని రామాలయాన్ని సందర్శించి, పూజలు చేశారు.

● బజార్‌హత్నూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో అయోధ్య శోభాయాత్ర నిర్వహించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



బోథ్: సొనాల రామాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ సోయం

● తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాలు రామ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు.

● మావల మండలంలోని వాఘాపూర్‌లో మురళీ కృష్ణ ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ చంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగించారు. భక్తులు రామ నామ సంకీర్తన చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో ఎంపీపీ గండ్రత్ రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు.

● ఇంద్రవెల్లి మండల కేంద్రంలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. రాముడు, సీత, హనుమన్ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● బేల: మండల కేంద్రంలో ప్రధానవీధుల గుండా భజన, కీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక శ్రీరామ మందిరంలో అయోధ్య మహోత్సవ ప్రత్యేక ప్రసార వీక్షణను రామభక్తులు తిలకించారు. మహాప్రసాదం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● అయోధ్య రామ మందిరంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా సిరికొండ మండల వ్యాప్తంగా శ్రీరామ నామస్మరణం మార్మోగింది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, హనుమన్ చాలీసా పారాయణం చేశారు. జై శ్రీరాం అంటూ.. నినాదాలు చేశారు.

● తలమడుగు మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముడి చిత్రపటంతో పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాపూర్, సుంకిడి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



తాంసి: పొన్నారిలో భారీ శోభాయాత్ర



ఇచ్చోడ: పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మహిళలు



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



ఇంద్రవెల్లి: నృత్యం చేస్తున్న మహిళలు, యువకులు



జైనథ్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



సిరికొండ: హనుమన్ చాలీసా పారాయణం



నార్నూర్: ప్రాణ ప్రతిష్ఠాపనను వీక్షిస్తున్న భక్తులు

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిర్రా దేవేందర్

ఎదులాపురం: కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సిర్రా దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో గల యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రిమ్స్ ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కాంట్రాక్ట్ ఏజెన్సీ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతోందని మండిపడ్డారు. పీఎఫ్, ఈఎస్ఐలలో సైతం దోచుకుంటున్నారని, పండుగ సమయంలో ఆర్జిత సేవలు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. మంగళవారం సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చందు, డేవిడ్, ప్రశాంత్, శంకర్, శివ, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ మల్లేశ్

నార్నూర్: మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సోమవారం సర్పంచు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానందు నాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన జరుగుతున్న సందర్భంగా హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చవాన్ మహేందర్, గ్రామస్తులు హరిచంద్, చౌహాన్ ప్రేమ్‌సింగ్, దత్త రాథోడ్, ఆడే దుల్ సింగ్, భిక్షపతి రాథోడ్, బానోత్ శాంతారావు, కోరెల మహేందర్ పాల్గొన్నారు.

పెద్దమ్మగుడి నిర్మాణానికి..

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో పెద్దమ్మ గుడి నిర్మాణానికి సర్పంచ్ మల్లేష్, వీడీసీ సభ్యులు సోమవారం భూమిపూజ చేశారు. త్వరలోనే గుడి నిర్మాణం పూర్తవుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఇచ్చోడ: మాల సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఇదుల్ల శంకర్, అధ్యక్షుడిగా బొజ్జ లక్ష్మణ్, ఉప అధ్యక్షుడిగా గ్యాతం గంగయ్య, జనరల్ సెక్రెటరీగా స్వామి, ట్రెజరర్‌గా బొజ్జ రాజ్ కుమార్, కార్యదర్శిగా మైల మహేశ్‌కుమార్, మహిళ ఉప అధ్యక్షురాలిగా మైల సంధ్య, మహిళ కార్యదర్శిగా సత్యమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

తలమడుగు: మాల సంక్షేమ సంఘం ఎన్నికైన సభ్యులు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో సభ్యులను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడిగా ఉడుగు అఖిలేష్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా మహేందర్, కోశాధికారిగా నక్క వేణు, కార్యదర్శులుగా రాకేష్, కిరణ్‌లను ఎన్నుకున్నారు. నాయకులు బిట్ల చైతన్య, లస్మన్న, చిన్న గంగన్న, గంగన్న పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై సమావేశం

బోథ్: బోథ్ మండల అభివృద్ధి ప్రణాళిక సమావేశాన్ని సోమవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మసూద్‌నగర్ కాలనీకి చెందిన అనాబియా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్ చికిత్స నిమిత్తం సోమవారం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఓ నెగిటీవ్ రక్తం అందుబాటులో లేకపోవడంతో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను కలిసి విషయాన్ని వివరించారు. స్పందించిన డీఎంహెచ్‌వో కళావతి బ్లడ్ బ్యాంక్ వారితో మాట్లాడి రక్తం అందేలా చర్యలు చేపట్టారు.

అఖండ జ్యోతికి అంకురార్పణ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని సిమెంట్ ఫ్యాక్టరీ ఆఫ్ ఇండియా (సీసీఐ) రామాలయంలో అఖండ జ్యోతికి మహేంద్ర కూలర్స్ యజమాని మహేందర్ జోషి సోమవారం అంకురార్పణ చేశారు. నిత్యం అఖండ జ్యోతి వెలిగించేందుకు కావాల్సిన నూనె దేవాలయానికి అందజేశారు. హిందూ సనాతన ధర్మం ప్రకారం అఖండ జ్యోతి వెలిగితే ఆ ఊరుకు అంతా మంచి జరుగుతుందన్నారు.

సమయపాలన పాటించాలి

బోథ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని బోథ్ సర్పంచ్ సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఒకటోవ నంబరు అంగన్‌వాడీ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులకు పాలు, గుడ్లు ఇవ్వడం లేదని పలువురు సర్పంచ్‌కు ఫిర్యాదు చేశారు. ఇకనుంచి అలా జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు.

రెండు రోజులు.. 2,248 దరఖాస్తులు

- ప్రత్యేక ఓటరు నమోదుకు స్పందన
- ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల

ప్రత్యేక శిబిరాల్లో అందిన దరఖాస్తుల వివరాలు..

నియోజకవర్గం	ఫారం–6	ఫారం–7	ఫారం–8
ఆదిలాబాద్	1,139	76	242
బోథ్	1,109	117	283



దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌వోలు (ఫైల్)

కైలాస్‌నగర్: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం– 2024లో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. జిల్లాలోని 592 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు రెండు రోజుల పాటు అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో 2,248 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే మరణించిన ఓటర్లు, రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన ఉన్న వాటికి సంబంధించి 193 దరఖాస్తులు అందాయి. ఓటరు కార్డులో తప్పొప్పుల సవరణలు, దివ్యాంగుల గుర్తింపు, మొబైల్ నంబర్ నమోదు, కొత్త ఓటరు గుర్తింపు కార్డు, పోలింగ్ కేంద్రం మార్పు వంటి వాటి కోసం 525 దరఖాస్తులు అందాయి. ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులను బీఎల్‌వోలు సహాయ రిటర్నింగ్ అధికారుల(తహసీల్దార్)కు అందజేశారు. వీటిని తహసీల్దార్ కార్యాలయ ఆపరేటర్లు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో నమోదు చేయనున్నారు.

2వరకు పరిశీలన

ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి అందిన దరఖాస్తులు, అభ్యంతరాలపై బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 2వరకు నిర్వహిస్తారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు మరణించిన, ఒకే చోట రెండు ఓట్లు కలిగి ఉన్నటువంటి వారి పేర్లను తొలగిస్తారు. జాబితాలో ఏమైనా పొరపాట్లు దొర్లితే వాటిని సవరిస్తారు. ఈ ప్రక్రియంతా ఫిబ్రవరి 2 వరకు పూర్తి చేస్తారు. ఫిబ్రవరి 8న ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఫొటోలతో కూడిన పారదర్శకమైన ఓటర్ల జాబితాను అందించాలనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లుగా అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న సబ్‌స్టేషన్ పనులు

- రూ. కోటి 54 లక్షల వ్యయంతో నిర్మాణం
- తీరనున్న లోవోల్టేజీ, విద్యుత్ సమస్యలు



సిర్సన్నలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో ఏడు నెలలుగా విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు కొనసాగుతున్నాయి. గత రాష్ట్ర ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ. కోటి 54 లక్షలు మంజూరు చేసింది. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే గ్రామాలకు లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయ సమస్యలు తీరనున్నాయి. అలాగే మండలంలోని సబ్‌స్టేషన్‌ల సంఖ్య నాలుగుకు చేరనుంది.

నిధులు ఆలస్యంతో..

మండలంలోని సిర్సన్న గ్రామంలో ఐదేళ్ల క్రితం నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిధులు మంజూరయ్యాయి. సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 353బీ హైవేకు పక్కన ఒకటిన్నర ఎకరా స్థలం కేటాయించారు. ఆ స్థలాన్ని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించినప్పటికీ, నిర్మాణ పనులు ముందుకు కదలలేదు. నిర్మాణ పనుల ప్రారంభానికి సాంకేతిక సమస్య. నిధుల జాప్యంతో టెండరింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. ఎట్టకేలకు గతేడాది టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈక్రమంలో జూన్ చివర్లో అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న ఈసబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు.

చివరి దశలో పనులు

సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ఏడు నెలలుగా కొనసాగుతున్నాయి. ఈ పనులన్ని పూర్తయి ఈనెలలో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభం కావాల్సి ఉంది. కానీ కొన్ని అనివార్య కారణాలతో ఇంకా పనులు పూర్తి కాలేదు. ఇంకా 33 కేవీ లైన్ 35 నుంచి 45 నుంచి విద్యుత్ స్తంభాలు పనులు కావాల్సి ఉంది. 11కేవీ లైన్ స్తంభాల పనులు 20 స్తంభాల వరకు చేపట్టాల్సి ఉంది. దీంతో పాటు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్, వీసీబీలు, తదితర పరికరాలు రావాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా కోసం సిర్సన్న టౌన్, సిర్సన్న ఏజీల్ (వ్యవసాయం) రెండు ఫీడర్‌లు ఏర్పాటు కానున్నాయి. ఒకటో ఫీడర్ పరిధిలో సిర్సన్న గ్రామానికి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా ఉండనుంది. రెండో ఫీడర్‌లో భాగంగా సిర్సన్న, సింగాపూర్, బాది, అవాల్‌పూర్ రెవెన్యూ శివారులోని వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కానుంది. దీంతో పాటు అనుసంధానంగా బాది, వడగూడ, అవాల్‌పూర్ గ్రామాలకు సైతం విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నారు.

తీరనున్న లోవోల్టేజీ సమస్య



మాగ్రామ శివారులో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం బేల సబ్‌స్టేషన్ నుంచి వ్యవసాయ సాగు కోసం విద్యుత్ సరఫరా ఉండడంతో లోవోల్టేజీ సమస్య ఏర్పడుతోంది. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే లోవోల్టేజీ సమస్య తీరనుంది.

–నానాజీ గౌడ్, రైతు

పనులు సాగుతున్నాయి



బేల సబ్‌స్టేషన్ నుంచి మా గ్రామానికి విద్యుత్ సరఫరా ఉంది. ఏళ్ల నుంచి ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. చాలాసార్లు అంధకార పరిస్థితి ఏర్పడింది. ఏడు నెలల నుంచి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

–హరీష్‌రెడ్డి, రైతు

నేడు హనుమన్ చాలీసా పారాయణం

సిరికొండ: నేడు మండల కేంద్రంలో మండల సనాతన ధర్మ సమితి ఆధ్వర్యంలో శ్రీనారాయణ్ మహరాజ్‌తో ఉదయం 10 గంటల నుంచి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు సనాతన ధర్మ సమితి నాయకులు తెలిపారు. అంతకుముందు మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కంకాళమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: జన్నారం మండలం వీరగుట్టపై ఈనెల 28న నిర్వహించే కేతేశ్వర కంకాళమ్మ జాతర పోస్టర్‌ను సోమవారం ఖానాపూర్‌లో నాయకులు ఆవిష్కరించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాల ఆహ్వానపత్రిక అందించి కరపత్రాలను ఆవిష్కరించారు.